క్లుప్తంగా

వ్యాధుల పట్ల అప్రమత్తం



జీఎం కొత్తూరు కేజీబీవీలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నారాయణ

జి.మాడుగుల: వాతావరణ మార్పుల వల్ల ప్రబలే వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, ఏదైన అనారోగ్యపరమైన సమస్య తలెత్తితే ఉపాధ్యాయులకు తెలియజేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నారాయణ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలో గల జీఎం కొత్తూరు కేజీబీవీలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వాతావరణ మార్పుల వల్ల జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ఏ చిన్న సమస్య వచ్చినా అశ్రద్ధ చేయకుండా విద్యార్థినులను స్థానిక ఆస్పత్రికి తరలించి వైద్యం అందించడానికి సహకరించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి



ఎర్రంపాలెం జీపీఎస్‌లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సాయి రతన్, చిత్రంలో ఎంఈవో మల్లేశ్వరరావు

గంగవరం : వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని, తరచూ హ్యాండ్‌వాష్, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాల గురించి వివరించాలని పిడతమామిడి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిరతన్, ఎంఈవో–2 టి.మల్లేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఎర్రంపాలెం గిరిజన ప్రాథమిక పాఠశాల(జీపీఎస్)ను వారు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు వైద్యాధికారి సాయిరతన్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంఈవో మల్లేశ్వరరావు పిల్లల హాజరు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్‌ఎం ఎస్.రామారావు, ఉపాధ్యాయిని జీవితేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా నందిగరువు రోడ్డు



కొట్టుకు పోయిన నందిగరువు రోడ్డు

పాడేరు రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో వంట్లమామిడి పంచాయతీ నందిగరువు రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్డు అధ్వానంగా తయారవడంతో నడిచేందుకు కూడా వీలులేకుండా ఉందని, కూటమి ప్రభుత్వం, పాలకులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని స్థానికులు మామిడి భీమరాజు, లక్ష్మణ్‌రావు కోరారు.

రాజారావుకు ఘన నివాళి



వర్ధంతి సభలో మాట్లాడుతున్న నాయకులు

రంపచోడవరం: భూమి,భుక్తి,విముక్తి కోసం పోరాటాలే శరణ్యమని నమ్మి జీవితాంతం గిరిజనుల కోసం పోరాడిన ఎస్.రాజారావు 4వ వర్ధంతి సభను రంపచోడవరం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించి, ఘనంగా నివాళులర్పించారు. పార్టీ డివిజన్ కార్యదర్శి కుంజా దూలయ్య మాట్లాడుతూ రంపచోడవరం, అడ్డతీగల, దేవీపట్నం మండలాల్లో గిరిజనేతర భూస్వాములు ఆక్రమించుకున్న భూములు గిరిజనులకు దక్కాలని రాజారావు పోరాటం చేశారని చెప్పారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.బాలుదొర, పల్లాల లచ్చిరెడ్డి, సర్పంచ్ పి.ఆదిలక్ష్మి, రంగారెడ్డి పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు



స్వాధీనం చేసుకున్న డ్రమ్ములతో ఎక్సైజ్ పోలీసులు

అడ్డతీగల : రంపచోడవరం ఎక్సైజ్ సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ పైడేశ్వరరావు రంపచోడవరం, కాకినాడ, ప్రత్తిపాడు ఎక్సైజ్ టీమ్ తో కలిసి రంపచోడవరం, ప్రత్తిపాడు స్టేషన్ల పరిధిలో పలు చోట్ల సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. అడ్డతీగల మండలం గొంటువానిపాలెంలో 1,200 లీటర్ల బెల్లం పులుపు, జడ్డంగి అన్నవరంలో 1,200 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం చేసి, ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ తెలిపారు.

నిరుపయోగంగా ఆర్టీసీ కాంప్లెక్స్

- ఆటోలు, ప్రైవేటు వాహనాల పార్కింగ్ స్థలంగా మారిన ప్రాంగణం
- వినియోగంలోకి తేవాలని కోరుతున్న మండల ప్రజలు



పెదబయలు మినీ ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో నిలిపిన ఆటోలు



పెదబయలు మినీ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ద్విచక్ర వాహనాలు, కార్ల పార్కింగ్

పెదబయలు : స్థానిక మినీ ఆర్టీసీ కాంప్లెక్స్ నిరుపయోగంగా మారి, ప్రైవేట్ వాహనాల యజమానులకు అడ్డాగా తయారైంది. సుమారు 12 సంవత్సరాల క్రితం మండల కేంద్రం పెదబయలులో ట్రాఫిక్ సమస్య పరిష్కారం, ప్రయాణికుల సౌకర్యార్థం దీనిని నిర్మించారు. కొన్నేళ్లపాటు వినియోగించినా తరువాత నిరుపయోగంగా వదిలేశారు. ప్రస్తుతం ఆటోలు, ద్విచక్రవాహనాలు, కార్లకు పార్కింగ్ స్థలంగా మారింది. ఈ ప్రాంగణంలో ప్రతి రోజూ ప్రైవేట్ వాహనాలను పెద్దసంఖ్యలో పార్కింగ్ చేస్తున్నారు. ఇక్కడ తమ వాహనాలను పార్కింగ్ చేసి ఇతర పనులకు వెళ్లిపోతున్నారు.

ట్రాఫిక్ సమస్య నివారణకు...

మండల కేంద్రానికి ప్రతి రోజు పాడేరు,అనకాపల్లి, విశాఖపట్నం డిపోల నుంచి 15 ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తాయి. బస్సులు నిలుపుతుండడంతో పాటు ప్రయాణికులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుండడంతో పెదబయలు ప్రధాన బజార్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దీంతో ఆ సమస్య పరిష్కారానికి గ్రామానికి మొదట్లో మినీ ఆర్టీసీ కాంప్లెక్స్ ఏర్పాటు చేశారు. ప్రారంభంలో ఆర్టీసీ సిబ్బంది అక్కడ బస్సులు నిలిపినా తరువాత మెయిన్ బజార్‌లో ఆపడం మొదలు పెట్టారు. దీంతో అక్కడ ట్రాఫిక్‌సమస్య మరింత ఎక్కువై స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బస్సులు నిలపకపోవడంతో ఆర్టీసీ మినీకాంప్లెక్స్ నిరుపయోగంగా మారింది. గతంలో పలుమార్లు పాడేరు ఆర్టీసీ డీఎం, ఇతర అధికారులు మినీ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకుని వస్తామని చెప్పినా కార్యరూపం దాల్చలేదు.దీంతో ప్రస్తుతం ఆర్టీసీ కాంప్లెక్స్ స్థలం ఆటో పార్కింగ్ సెంటర్‌గా మారింది.సోమవారం ఆటోలు, మిగిలిన రోజులు ద్విచక్ర వాహనాలు, కార్ల పార్కింగ్‌కు ఈ ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణాన్ని వినియోగిస్తున్నారు.



ట్రాఫిక్ సమస్య కారణంగా పెదబయలులో ప్రధాన బజారు ప్రాంతంలో నిలిచిన వాహనాలు

సులభ్ కాంప్లెక్స్ లేక అవస్థలు

ఈ మినీ కాంప్లెక్స్‌లో పలు సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ముఖ్యంగా ఇక్కడ సులభ్ కాంప్లెక్స్ లేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడ సులభ్ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తెవడంతో పాటు బస్సులను మినీ కాంప్లెక్స్‌లో నిలిపితే ప్రయాణికులకు మరుగుదొడ్ల సమస్యతో పాటు మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య తీరుతుంది.

ఆర్టీసీ అధికారులు స్పందించాలి



పెదబయలు మినీ ఆర్టీసీ కాంప్లెక్స్ ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉంది. ప్రధాన బజార్‌లో బస్సులు ఆపడం వల్ల ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మినీ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మరుగుదొడ్లకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకుని వచ్చి, బస్సులు ఇక్కడ నిలిపితే ఉపయోగకరంగా ఉంటుంది. ప్రధాన బజార్‌లో ట్రాఫిక్ సమస్య తీరుతుంది. సంబంధిత ఆర్టీసీ అధికారులు స్పందించాలి.

– మజ్జి చంద్రుబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు, పెదబయలు మండలం

వినియోగంలోకి తెస్తాం

మండల కేంద్రం పెదబయలులో ఉన్న మినీ ఆర్టీసీ కాంప్లెక్స్‌ను త్వరలో వినియోగంలోకి తీసుకొస్తాం. సివిల్ ఇంజినీర్లతో కలిసి సందర్శించి, సదుపాయాల కల్పనపై చర్యలు తీసుకుంటాం. మినీ కాంప్లెక్స్‌లోనే ఆర్టీసీ బస్సులను నిలిపేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు, ఆర్టీసీ ఆస్తులు కాపాడతాం. – ఉమామహేశ్వరరావు, ఆర్టీసీ డిపో మేనేజర్, పాడేరు

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

- యువజన నాయకుడు చాణక్య

అనంతగిరి (అరకులోయ): వైఎస్సార్‌సీపీ మరింత బపలపడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు రేగం చాణక్య అన్నారు. శుక్రవారం మండలంలోని పైనంపాడు, వేంగడ, వాలసీ గ్రామపంచాయతీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా చాణక్య మాట్లాడారు. జగనన్న పాలనలో కులమతాలకు అతీతంగా పార్టీ పదవులు ఇచ్చారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించారన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో కేవలం పచ్చ నేతలు, వారి బంధువులకే ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థుల విజయానికి అందరూ కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి నీలవేణి, నియోజకవర్గం బూత్ కమిటీ ఇన్‌చార్జీ పాంగి విజయ్‌కుమార్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పాంగి అప్పారావు, మాజీ జెడ్పీటీసీ దూరు గంగన్న దొర, సర్పంచ్‌లు జన్ని సన్యాసిరావు, పెంటమ్మ, రాములమ్మ, సెంబి సన్యాశిరావు, ఎంపీటీసీలు జయశ్రీ, చంద్రయ్య, నాయకులు గుజ్జెలి మధుసూదనరావు, చందు పట్నాయక్ పాల్గొన్నారు.

ఆదివాసీ స్పెషల్ డీఎస్సీపై ప్రభుత్వం ప్రకటన చేయాలి

పాడేరు రూరల్: ఆదివాసీ డీఎస్సీపై కూటమి ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని ఆదివాసీ డీఎస్సీ సాధన కమిటీ జిల్లా కన్వీనర్ సాగిన ధర్మన పడాల్, కూడ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగుల సంఘం నేతలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ 5వ షెడ్యూల్డ్ ప్రాంతంలో ఆదివాసీలకే నూరు శాతం రిజర్వేషన్ ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందన్నారు. గిరిజన ప్రాంతంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ప్రత్యేక డీఎస్సీ ద్వారా స్థానిక గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని కోరారు. గిరిజన డీఎస్సీ అభ్యర్థులను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. చంద్రబాబు అబద్ధపు హామీలతో మరోసారి ఎవరూ మోసపోవద్దని, కూటమి విధనాలను వ్యతిరేకించాలని తెలిపారు. ఈనెల 28న జిల్లా కేంద్రం పాడేరులో జరిగే రాష్ట్ర సదస్సుకు అన్ని జిల్లాల నుంచి ఆదివాసీ నిరుద్యోగ యువతీయువకులు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు రామకృష్ణ పడాల్,శంకర్, విష్ణుమూర్తి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న డీఎస్సీ అభ్యర్థులు, ప్రజా సంఘాల నాయకులు

డుడుమ బస్సు సర్వీసు సక్రమంగా నడపాలి

- గిరిజన సంఘ నేతల ఆందోళన

ముంచంగిపుట్టు: పాడేరు ఆర్టీసీ డిపో నుంచి ముంచంగిపుట్టు మండల కేంద్రం మీదగా డుడుమకు బస్సు సర్వీసును ప్రతి రోజు సక్రమంగా నడపాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో ప్రయాణికులు ఆందోళన చేశారు.ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం.ఎం.శ్రీను మాట్లాడుతూ డుడుమ బస్సు సర్వీసును మూడు నెలలుగా సక్రమంగా నడపడం లేదని,ఈ మార్గంలో ప్రయాణించే ఉద్యోగులు,ఉపాధ్యాయులు,ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఈ మార్గంలో నడిపే ఒకే ఒక్క ఆర్టీసీ బస్సును అధికారులకు ఇష్టం వచ్చినట్లు నడపడం తగదని,సరిహద్దులోని ఐదుపంచాయితీల గిరిజనులు,ఒడిశా వాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. డుడుమ బస్సు కోసం పోలీపుట్టు,లబ్బూరు,మాకవరం,తలబిరడా,అసరాడ,దాబుగూడ,సంగడ స్టాప్‌ల వద్ద ప్రతి రోజు ప్రయాణికులు నిరీక్షించాల్సి వస్తోందని, దిక్కుతోచని పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ దుస్థితి పట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నేతలు సోలగం గాసిరందొర,మట్టం నరసింగ రావుపడాల్ తదితరులు పాల్గొన్నారు.



బస్సును సక్రమంగా నడపాలని ముంచంగిపుట్టులో ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నేతలు

గోమంగి కేంద్రంగా ప్రత్యేక మండలం ఏర్పాటు చేయాలి

- పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు వినతి

పెదబయలు: గోమంగి కేంద్రంగా ప్రత్యేక మండలాన్ని ఏర్పాటు చేయాలని గోమంగి మండల సాధన సమితి అధ్యక్షుడు సల్లంగి ఉమామహేశ్వర రావు కోరారు. శుక్రవారం పాడేరులో ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసి, 23 గ్రామ పంచాయతీలను కలిపి గోమంగిలో మండల కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు.1983లో అప్పటి ప్రభుత్వం మండలాలు ఏర్పాటు చేసిందని,పెదబయలు మండలం గోమంగికి రోడ్డు లేని కారణంగా ఒడిశాకు అనుకుని ఉన్న పెదబయలును మండల కేంద్రంగా ఏర్పాటు చేశారన్నారు. గోమంగి కేంద్రంగా మండలం ఏర్పాటు చేస్తే 17 గ్రామ పంచాయతీలకు అనుకూలంగా ఉంటుందన్నారు. గోమంగి కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలని 1998 నుంచి గోమంగి మండల సాధన సమితి ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తున్నట్టు చెప్పారు. శివారు గ్రామాలకు పెదబయలు మండల కేంద్రం 45 నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉందని ఏ పనికి వెళ్లాలన్నా ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం జిల్లాలు, మండలాల విస్తరణకు సుముఖంగా ఉన్నందున గోమంగి కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలని, గోమంగి నుంచి జిల్లా కేంద్రం పాడేరు రావడానికి, పెదబయలు, ముంచంగిపుట్టు, జి.మాడుగుల మండలాలకు కలుపుతూ రోడ్డు సదుపాయం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సాధన సమితి ప్రతినిధులు కొమ్మ అనంత పద్మనాభం, కొమ్మ బాలరాజు, విశ్రాంతి ఉద్యోగి సల్లంగి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



పాడేరులో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న గోమంగి మండల సాధన సమితి అధ్యక్షుడు,నాయకులు

తమ్మన్నదొరకు ఘన నివాళి



చింతూరు మండలం నర్సింహపురంలో తమ్మన్నదొర చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేఏసీ నాయకులు

చింతూరు: తొలితరం మన్యం వీరుడు కారం తమ్మన్నదొర వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని నర్సింహపురంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జేఏసీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రంపచోడవరం కేంద్రంగా బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా తమ్మన్నదొర అనేక ఉద్యమాలు చేశారని చెప్పారు. ప్రభుత్వం ఆయన పేరుతో రంపచోడవరాన్ని జిల్లాగా ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ చైర్మన్ జల్లి నరేష్, తిమ్మ సాయివెంకటరమణ, కారం రంగారావు, వెంకటనారాయణ, సోడె నారాయణ, సీతారామయ్య, బాలకృష్ణ, రమేష్, వినోద్ పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలతో గుర్తింపు



బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులను సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి,సర్పంచులు,నేతలు

ముంచంగిపుట్టు: విధి నిర్వహణలో నిస్వార్థమైన సేవలు అందిస్తే మంచి గుర్తింపు వస్తుందని వైస్ ఎంపీపీ శిరగం భాగ్యవతి అన్నారు. వనుగుమ్మ గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళుతున్న ఐదుగురు సచివాలయ ఉద్యోగులకు వనుగుమ్మ,రంగబయలు పంచాయతీలకు చెందిన ప్రజలు శుక్రవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైస్‌ఎంపీపీ భాగ్యవతి, సర్పంచ్‌లు మిల్కి,ధన్య, ఉపసర్పంచ్ సీతారామ్, పలు పార్టీల నేతలు జ్ఞాపికలు అందించి,దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.వారు చేసిన సేవలను పలువురు కొనియాడారు.ఈ సందర్భంగా వైస్‌ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలతో మమేకమవుతూ విధులు నిర్వహిస్తే తప్పక మంచి గుర్తింపు వస్తుందని, ఎక్కడ పని చేసినా సేవాభావంతో పని చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కిరణ్,భగత్, వైఎస్సార్‌సీపీ మండల నేతలు దేవా,నీలకంఠం,సీదేశ్,సీతరామ్,కామేష్ తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

ముంచంగిపుట్టు: గిరిజన రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఏకలవ్య ఫౌండేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక ఏకలవ్య ఫౌండేషన్ కార్యాలయంలో శుక్రవారం మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ పాలక వర్గ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సతీష్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన రైతులు పండించే ప్రతి పంటను గిట్టుబాటు ధర వచ్చేలా అమ్ముకాలు చేసుకోవాలని,ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు.కాలానికి అనుగుణంగా పంటలు వేయాలని,ముఖ్యంగా ఆర్గానిక్ పంటలపై దృష్టి పెట్టాలని చెప్పారు. గిరిజన ప్రాంతంలో లభించే పంటలకు బహిరంగ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు.మహిళా రైతు ఉత్పతిదారుల సంస్థలోని రైతులకు రాయితీపై పనిముట్లు అందించనున్నట్టు తెలిపారు. అనంతరం మహిళా రైతు ఉత్పతిదారుల సంస్థలో సభ్యత్వం పొందిన వారికి సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా ఇన్‌చార్జి ఉమావెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వం సర్టిఫికెట్లు అందిస్తున్న ఫౌండేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ సతీష్‌కుమార్

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం



వైఎస్సార్‌సీపీ పాడేరు, జీకే వీధి, చింతపల్లి, జి.మాడుగుల మండల అధ్యక్షులు వరుసగా రాంబాబు, గిరిప్రసాద్, గణబాబు, మత్స్యకొండంనాయుడు

పాడేరు: వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో పలు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యవర్గాలను అధిష్టానం ప్రకటించింది. గతంలోనే కొయ్యూరు మండల వైఎస్సార్‌సీపీ మండల కమిటీని ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా శుక్రవారం పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జీకే వీధి మండలాలకు సంబంధించి పూర్తి స్థాయి కమిటీలను పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. నూతనంగా నియామకమైన మండల కమిటీల అధ్యక్షులు, ఇతర కార్యవర్గం పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు శక్తివంచన లేకుండా పని చేస్తామని చెప్పారు.

పాడేరు మండల కార్యవర్గం

వైఎస్సార్‌సీపీ పాడేరు మండల అధ్యక్షుడిగా డి.గొందూరు సర్పంచ్ సీదరి రాంబాబు, ఉపాధ్యక్షులుగా కాడెలి సర్పంచ్ వనుగు బసవన్న దొర, వనుగుపల్లి మాజీ సర్పంచ్ పాంగి నాగరాజు, ప్రధాన కార్యదర్శులుగా కించూరు సర్పంచ్ వంతాల రాంబాబు, లకే రామసత్యవతి, వంతాల నరేష్, పలాసి రామారావు, కార్యదర్శులుగా గబ్బంగి సర్పంచ్ గొల్లోరి నీలకంఠం, కిల్లు కృష్ణ, రొబ్బా కృష్ణారావు, గెమ్మెలి రాజు, తమర్బ బాబులు నాయుడులతో పాటు కార్యవర్గ సభ్యులుగా లగిసపల్లి ఎంపీటీసీ సభ్యుడు లకే రామకృష్ణ పాత్రుడు, మాజీ సర్పంచ్ కుంతూరు బొంజుబాబు, గెమ్మెలి ఈశ్వర్‌రావు, కొర్రా సూరిబాబు, మాదల మోహన్‌రావు, గబ్బాడ రాజారావు, సిల్లో సూర్యప్రకాష్, కొరాబు గంగా భవానీ, ముడవ వెంకన్న, సారే చిన్నలక్ష్మి, పూమబంధ వెంకటరమణ, మినుముల వెంకటరమణ, సోమెలకొండబాబు, కొమ్ము సురేష్‌కుమార్, సామేలి స్వామీ, సామేల సూర్యరావు, అల్లంగి ప్రసాద్, కొర్రా బొంజుబాబులను నియమించారు.

జీకే వీధి మండల కార్యవర్గం

వైఎస్సార్‌సీపీ జీకే వీధి మండల అధ్యక్షుడిగా కంకిపాటి గిరిప్రసాద్, ఉపాధ్యక్షులుగా వంతాల అరుణ్‌కుమార్, రీమల బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శులుగా కొర్రా బలరాం, పిళ్ళ బుజ్జిబాబు, వంతాల చంటిబాబు, పాంగి చందర్‌రావు, కార్యదర్శులుగా పాతుని లక్ష్మణరావు, సిరిబాల రామారావు, సింగన వెంకటరావు, పాతుని గంగరాజు, కొర్రా ఉర్థోప్, కార్యవర్గ సభ్యులుగా చింతాడ నూకరాజు, డికొళ్ళ స్వర్ణలత, కాలేబు రాజశేఖర్, వెలుగురి సత్యనారాయణ, కోడా బొంజుబాబు, గొల్లోరి మహాదేవ్, వంతాల చిట్టిబాబు, కొర్రా సుబ్బారావు, వంతాల సుబ్బారావు, ముర్ల వెంకటరావు, దేవరాజు ఉదయ్ భాస్కర్, వంతాల అప్పారావు, వీరోజి సత్తిబాబు, పాంగి చిరంజీవి, ముర్ల కోటేశ్వరరావు, తగ్గి సంజీవ రావు, సాగిన సతీష్, వంతాల రాజారావు, జర్తా బాలన్న, లువ్వాబు సతీష్, ముచ్చల చిన్నబ్బాయ్‌లను నియమించారు.

చింతపల్లి మండల కార్యవర్గం

చింతపల్లి: వైఎస్సార్ సీపీ చింతపల్లి మండల అధ్యక్షునిగా పాంగి గణబాబు నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా వనగల బెన్నిబాబు,పాటూకూరి బెన్నా స్వామి,ప్రధాన కార్యదర్శులుగా మఠం గణేష్, రావులు నూకరాజు, కుడుములు లోవరాజు, గబులంగి మోహనరావు, కార్యదర్శులుగా వంతల రాజారావు, సలిమితి లక్ష్మయ్య, బొబ్బిలి చిన్న, పాంగి సుబ్బారావు, కోరాబు కరుణానిధితో పాటు కార్యవర్గ సభ్యులుగా కేపరి రాంబాబు,సీదెరి సోమరాజు, లాకరి వెంకటరావు,కొర్రా బాలరాజు,పాంగి అప్పన్న,కొర్రా సన్యాసిరావు,కిల్లో సదాశివ,గెమ్మిలి రమణ,వంతల మంజు,బొండా సింహాచలం,పొట్టిక లోవరాజు,కొర్రా రమేష్ నాయుడు, గెమ్మిలి సింహాచలం,సాగిన వెంగళరావు,ఎల్లమ్మజెట్టి రాజేశ్వరి, కొర్రా ప్రసాద్,సాగిన సంజీవరావులను నియమించారు.

జి.మాడుగుల మండల కార్యవర్గం

జి.మాడుగుల: వైఎస్సార్‌సీపీ జి.మాడుగుల మండల కమిటీ నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా నుర్మని మత్స్యకొండంనాయుడు, ఉపాధ్యక్షులుగా కురిడే వలయ్య,బెదరా బంగార్రాజు, ప్రధాన కార్యదర్శులుగా మర్రి బాలరాజు, బుటారి భగవన్, గెమ్మెలి లక్ష్మీనాయుడు, కోరాబు కొండబాబు, కార్యదర్శులు కొర్రా సోంబాబు, ఉల్లి కామేశ్వరరావు,టి.వరలక్ష్మి,గబ్బాడి పండుదొర,బోనంగి బాలయ్యపడాల్,కార్యవర్గ సభ్యులుగా వండలం రాంబాబు,వేముల రాధ, ఐసరం చిన మత్స్యకొండబాబు, బోయ సింహాద్రి, వనగల రాధాకృష్ణ, తలారి వెంకటరమణ, వంతాల ప్రసాద్,కొర్రా భీమరాజు, గావెలి రమణబాబు, వంతాల అచ్చిబాబు, అంగనయిని దేముడునాముడు,జర్రా కొండబాబు, సీదరి అప్పలరాజు, కొండపల్లి చినకొండబాబు, వనభంగి చిన్నారావు, ఎంద్రపల్లి అప్పారావు,కుమ్మరి చంద్రపతి నియమితులయ్యారు.

ఆడబిడ్డ నిధి ఎప్పుడిస్తారు

- అరకు జెడ్పీటీసీ శెట్టి రోషిణి



అరకులోయటౌన్: రాష్ట్రంలో 18 సంవత్సరాలు నిండిన మహిళలకు ప్రతి నెల రూ. 1500 ఆడ బిడ్డ నిధిగా చెల్లిస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికార పీఠం ఎక్కి ఏడాది గుడుస్తున్నా దాని గురించి పట్టించుకోవడం లేదని అరకులోయ జెడ్పీటీసీ శెట్టి రోషిణి అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ నిధి ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమని చెప్పిన చంద్రబాబు ఆ హామీని ఎప్పుడు నెరవేరుస్తారని ప్రశ్నించారు. ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు ఇస్తామన్న హామీని నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. గిరిజనుల సంపద దోచుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న కూటమి నేతలు ఎన్నికల హామీలను మాత్రం తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే రానున్న ఎన్నికల్లో మహిళలే కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

‘రాష్ట్ర ప్రజలను వంచించిన చంద్రబాబు’

దుంబ్రిగుడ: ఎన్నికలముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబు, కూటమి నాయకులు రాష్ట్ర ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పరశురాం, జెడ్పీటీసీ జానకమ్మ , వైస్ ఎంపీపీ పి.లలిత ఆరోపించారు. సాగర గ్రామంలో శుక్రవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. జోరువానలో సైతం ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు బి.శాంతి, మండల కార్యదర్శి బి.లీలరాణి, నియోజక వర్గం బూత్ కమిటీ సభ్యుడు బురిడి మోహన్‌రావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బాకా సింహాచలం, కృష్ణరావు పాల్గొన్నారు.



సాగర గ్రామంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బలపం పంచాయతీ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తాం

చింతపల్లి: అతిమారు మూల గల బలపం పంచాయతీలో సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీపీ కోరాబు అనూషదేవి,జెడ్పీటీసీ పోతురాజు బాలయ్యపడాల్ తెలిపారు.వీరు మండల అధికారులతో కలసి బలపం పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం లేక పోవడంతో పాటు ఉన్న రోడ్లు,కల్వర్టులు పూర్తిగా శిథిలమవడంతో రాకపోకలకు గిరిజనులు ఇబ్బందులకు గురువుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లోతుగెడ్డ వంతెన నుంచి మూలకొత్తూరు వరకూ రహదారి అధ్వానంగా ఉందని తెలిపారు. కోరుకొండ నుంచి చెరువూరు దిగజగబ,లబడంపల్లి,ఎగజనబ గిల్లలబంద,తడ్డపల్లి,పెబ్బంపల్లి,సబ్బపల్లితో పాటు పలు గ్రామాలకు రాకపోకలు సాగించడానికి గిరిజనులు ఇబ్బందుల పడుతున్నారన్నారని చెప్పారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పరిస్థితి మరింత అధ్వానంగా ఉందని తెలిపారు. రహదారుల మరమ్మతులకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ పంచాయతీలో రహదారులతో పాటు పాఠశాల భవనాలు,అంగన్‌వాడీ కేంద్రాలు,ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి,ఏపీవో రాజు పాల్గొన్నారు.



బలపం పంచాయతీలో పర్యటిస్తున్న ఎంపీపీ అనూషదేవి,జెడ్పీటీసీ బాలయ్య పడాల్